కథానిక:

# మేటినీ షో

శ్రీ 'రావుబాబు'

శనివారం 'మేటినీషో'కి సినిమాకి వెళ్లేడు కృష్ణమూర్తి కుటుంబసహితంగా.

"సుఖసంసారమె పరమానందం ..."

పాట చెవుల్లో గింగురుమంటూనే వుంది. లైట్లు వెలిగిపోయాయి. బాల్కనీమీద నాయుడుగారి అమ్మాయిలను చూచిన యువకులంతా ఒక్క సెకండు కూడా ఆలస్యం చెయ్యకుండా ఆ దొమ్మిలోంచి బయట పడి ఆడవాళ్ల గేటుదగ్గరకు చేరుకున్నారు. కృష్ణమూర్తి, అరగంట తంటాలుపడి ఎల్లాగో పరిచయం కల్పించుకున్న లేడీడాక్టరుతో ప్రసంగిస్తూ తాపీగా పైకివచ్చి, ఆమె కారెక్కి వెళ్లిపోగానే తనభార్య కోసం చూస్తూ ఆడవాళ్ల గేటుసమీపానికి వచ్చేడు. అప్పటి కప్పుడే చాలామంది యువకులు ఆ గేటువద్ద గుమిగూడి మొహం అంతా కళ్లుచేసుకొని కాచుకొని వున్నారు.

ఇరువైపులా సంరక్షణకర్తల్లాగున్న మగవారి మధ్యనుండి పారుతోంది మహిళాప్రవాహం. ద్వారము లోంచి వస్తూన్న ప్రతియువతినీ నఖశిఖపర్యంతము పరీక్షచేసే వదలిపెడుతున్నారు యువకబృందం. అంతలో మెరపు మెరసినట్టు నాయుడుగారి అమ్మాయీలు ద్వారంలోంచి వచ్చేరు. యువకుల్లో తొక్కిడి ప్రారంభించింది. ఆ అమ్మాయిల వెంటే ఓ పెద్ద యువకప్రవాహం బయలుదేరి వారిని వారి కారుదాకా సాగనంపి, వారు కారెక్కి వెళ్లిపోయింతర్వాత ఆ పెట్రోలుగేసు నాఘ్రాణిస్తూ, ఆనాటి కో ఘనకార్యము నెరవేర్చినట్టు ఒకర్నొకరు చూసి సకిలించుకుంటూ యిళ్లకు జారిపోయారు.

ఆసమయానికే గేటులోంచి సుశీల రావడం నుంచి పాపం కృష్ణమూర్తి కాపరమాన్నను అందరితో పాటు జుఱ్ఱుకునే భాగ్యం లేకపోయింది.

సుశీల రెండేళ్ల రాజుని చంకని వేసుకొని "అబ్బ! ఏమి మంది! ఏమి మంది!" అని నిట్టూర్పులు విడుస్తూ మగనిని సమీపించి, చంకనున్న పిల్లాడిని అతని కప్పగించి "జట్కా చూడండి, చీకటి పడుతోంది, వేగం పోదాం" అని తానే జట్కాస్టాండుదగ్గరకి దారి తీసింది.

ఇంతలో వీరికద్దనే ఓజట్కా ఆగింది. అందులోనుండి కమలం, రామారావు దిగేరు. సుశీల కమలాన్ని గుర్తుపట్టి "అరె! ఎప్పుడు రావడం?" అని దగ్గరకు వెళ్లింది.

కృష్ణమూర్తి కమలాన్ని చూచి ఆశ్చర్యపోయాడు. తను అత్తవారింటికి వెళ్లినప్పుడల్లా ఎదురుగానున్న కిటికీలో దర్శనం యిస్తుండే గోహారుబొమ్మ ఎట్టయెదుట ప్రత్యక్షం!

కృష్ణమూర్తి ఇన్స్టింక్టు పురిగొల్పడాన్ని పక్కనే వున్న రామారావుబుజముమీద చెయ్యివేసి "ఏమండోయి రామారావుగారూ! ఎప్పుడు రావడం? ఏమిటి సంగతి? నన్ను గుర్తుపట్టే వుంటారు. రెండుమూడుసార్లు మా అత్తవారింటికి వచ్చినప్పుడు మిమ్మల్ని చూసేను. కాని పరిచయం చేసుకునే అవకాశం లేకపోయింది" అన్నాడు, లేని ఆప్యాయనం ప్రదర్శిస్తూ. రామారావును చూసినప్పుడల్లా అసహ్యించుకొనే కృష్ణమూర్తికి ఇప్పుడు సమయానుకూలంగా అతనితో మైత్రి కలుపుకోవలసివచ్చింది.

స్వతహాగా మితభాషి అయిన రామారావు కృష్ణమూర్తివంక చూచి లేని నవ్వుతో "తమ రీవూరిలోనా వున్నారు? నాకు తెలీసే తెలీదండి" అని మాత్రము అని జట్కావాడికి డబ్బు లివ్వడానికి పర్సు తీసేడు.

అతన్ని చూస్తుంటే కృష్ణమూర్తిఆలోచనలు వెనకటిరోజులకు పరుగెత్తేయి. ప్రతిసాయంత్రమూ నీళ్లు కారుతూ కాళ్లీడ్చుకుంటూ వచ్చిన ఈ క్లోజు క్రాపు బుర్రనీ, అటు ఫేస్ పౌడరు వాసననూ సెంటుతో గుమగుమలాడే కమలాన్నీ చూసి "కాకిముక్కుకి...!" అని ఎన్నిసార్లు తను అనుకోలేదు!

"మళ్లీ కలుద్దాము" అని చెప్పి రామారావు టిక్కెట్లు కొనడానికి వెళ్లేడు.

సుశీల కమలాన్ని చూచి "అయితే ఎప్పుడు వచ్చేరు? ఎక్కడ దిగేరు? మీ వారికి ట్రాన్స్ఫర్ అయిందా ఏమిటి?" అని కుశలప్రశ్న ప్రారంభించింది.

"అవును, ట్రాన్స్ఫర్ అయింది. మధ్యాహ్నము ప్యాసింజరులో వచ్చేము. నేషనల్ హోటలులో దిగేము"

కృష్ణమూర్తి అందుకున్నాడు: "ఛాఛా! నేషనల్ హోటలులో దిగడమేమిటి—వెధవ వంటా, వెధవ తిండీని!"

"ఈరెండుమూడురోజుల్లో ఏదో యిల్లు చూసుకోవాలి" అంది కమలం అతనివైపొకసారి చూసి.

కృష్ణమూర్తి భార్యవంక తిరిగి "అన్నట్టు మన యింటి కెదురుగా నున్న రమణమ్మగారిల్లు ఖాళీ అవుతున్నట్టుందే. ఆయిల్లు వీరికి సరిపోతుందేమో!" అన్నాడు.

"అవును. విశాలంగా చాలా బాగుంటుంది. పండెండురూపాయలు కాబోలు అద్దె" అని సుశీల కమలంవంక చూసింది.

"ఆయన్ని రేపొకసారి వెళ్లి చూడమంటాను" అంది కమలం.

కృష్ణమూర్తి భార్యవంక చూసేడు. "పోనీ, రేపు మనింటికి—"

సుశీల కమలంవైపు చూచి "అవును. మేముంటూంటే హోటలు మెతుకు లేం గ్రహచారం? మా యింటికి వచ్చేయండి. ఈరాత్రికి మాతోపాటు ఏదో ఫలహారం—" అంది.

"రాత్రిఫలహారం అయిపోయిందిలే..."

ఇంతలో రామారావు టిక్కెట్లు పట్టుకొని వచ్చేడు. సుశీల మగనివంక చూసింది. కృష్ణమూర్తి రామారావుబుజంమీద చేయివేసి "హోటల్లో ఏమిటి తింటారు? ఈరాత్రి సరాసరి మాయింటికి వచ్చేయండి సార్. సామాన్లు రేపు తెచ్చుకోవచ్చు ... ఎటికా పరిచయం ఉన్నవాళ్లంగాని పైవాళ్లం కాముగదా... మాయింటి కెదురుగా ఓఇల్లు ఖాళీఅవుతోందికూడాను. మీ కది నచ్చుతుందో లేదోకూడా చూసుకుందురుగాని" అన్నాడు.

రామారావు కమలంవంక చూసేడు.

కృష్ణమూర్తి రామారావువంక చూస్తూ "ఒక్క దగ్గిరే వుంటే ఆడవాళ్లిద్దరికీ కొన్నాళ్లు ఊసుపోతుంది" అని ఓముక్క వేసేడు.

హోటలుఖర్చులు తగ్గినందుకు లోన సంతోషిస్తూ, రామారావు కృష్ణమూర్తివంక చూస్తూ "సినీమా నుంచి రావడం చాలా ఆలస్యం అవుతుందేమో... అంతరాత్రి మిమ్మల్ని తొందర చెయ్యడం..."

సుశీల కమలంవంక చూస్తూ "పోనీ, రేపు పొద్దున్నే వచ్చేయండి. హైస్కూలు వీథిలో కాంపౌండుగల ఇల్లే మాది" అంది.

కమలం సుశీలలోని మార్పు కనిపెట్టిందిగాని ఇరువురు మొగవాళ్లూ దగ్గిరే వుండడాన్ని ఆప్రసంగం ఎత్తడానికి వీలయిందికాదు.

రామారావు భార్యవంక చూస్తూ "జాగాలుండవుకాబోలు. లోపలికి వెళ్దాము" అన్నాడు.

కమలం సుశీలా, కృష్ణమూర్తులవంక చూస్తూ "మీరుకూడా రాకూడదూ? అంతా కలిసి వెళ్దాము" అంది.

"అబ్బ! చూసింది మళ్లా చూస్తే నాకు తలనొప్పి వస్తుంది. ఇంటికి వెళ్లి ఫలహారమో ఏదో చేసుకోవాలా ఇంకా?"

"ఫలహారానికేమిలే? తిరిగి వస్తున్నప్పు డెక్కడయినా తోవలో కానివ్వవచ్చు" అన్నాడు కృష్ణమూర్తి నసుగుతూ.

"మళ్లీ ఎక్కడ వెళ్తాములేద్దురూ" అని జట్కా ఎక్కింది సుశీల.

కమలం, రామారావులు వీరిద్దరివద్ద సెలవు పుచ్చుకొని సినీమాహాలులోనికి వెళ్లిపోయారు. కమలాన్ని చూస్తూ జట్కా ఎక్కేడు కృష్ణమూర్తి.

జట్కా వెళ్తోంది. సుశీల సినీమాకథని మననం చేసుకుంటోంది. కృష్ణమూర్తిమనసుమాత్రం వేరే విహరిస్తోంది.

"అయినా, అది బాగాలేదు సుమండీ"

"ఏది?" అన్నాడు కృష్ణమూర్తి కంగారుపడి.

"అక్కడ... కథానాయకుడు...దాన్ని—"

కృష్ణమూర్తి స్తిమితపడ్డాడు.

"అంత చదువుకున్నవాడు అలా ప్రవర్తించడం ..."

మిస్టర్ యస్. కృష్ణమూర్తి, యం. ఏ., యల్. టి. ఏమీ మాట్లాడలేదు.

* * *

ఇంట్లో పూరీలు చేస్తూ మెల్లిగా పాడుకుంటోంది సుశీల: "సుఖసంసారమె పరమానందం"

కృష్ణమూర్తి వాలుకుర్చీలో కూర్చొని ఆమెను చూస్తున్నాడు. కమలంస్వరూపం అతని కన్నులకింకా కట్టుతూనేవుంది.

ఉన్నట్టుండి సుశీల అంది: "మన ఇల్లు వాళ్లకి తెలుస్తుందో లేదోసుమండీ."

"కనుక్కొని వారే వస్తారు" అన్నాడు కృష్ణమూర్తి యాదాలాపంగా.

"ఊరు కొత్త. దారి తప్పవచ్చును. మీరోసారి పొద్దుట వెళ్తే మంచిదేమో."

"అలాగే చూద్దాములెద్దూ. మీ పుట్టింటి వూరివాళ్లు అని ఎంత ఉబలాటపడిపోతున్నావ్!"

తన కేమీ ఆ ప్రసక్తి లేనట్టుండడానికి పాపం అతని ప్రయత్నం!

* * *

మర్నాడు కాఫీలయాక నీటుగా దుస్తులు వేసుకొని పైమీద వోణీ వేసుకొని నేషనల్ హోటలుకు బయలుదేరేడు కృష్ణమూర్తి — భార్యచేత ఓసారి బలవంతం చేయించుకొని. అదృష్టము వరించింది తన్ని.

మేడమీద వారిబసలో ఒంటరిగా ఫేస్ పౌడరు రాసుకుంటూ మెల్లిగా పాడుకుంటోంది కమలం.

"రాగసుధారసము
అనురాగసుధారసము"

కృష్ణమూర్తి ఆ కంఠమాధుర్యానికి అచ్చెరువందుతూ మెల్లిగా అడుగులు వేసుకుంటూ గదిద్వారం సమీపించేడు. పిరుదులదాకా పడుతున్న ఆ కేశ సౌందర్యానికి ఆశ్చర్యపడి ఒక్కఘడియ ద్వారమువద్ద అలా నిలబడిపోయినాడు. అద్దములోంచి ఇతన్ని చూసి వెనక్కు తిరిగింది కమలం. మలచినట్టున్న ఆవిగ్రహము చూసేసరికి కృష్ణమూర్తిహృదయము ఒక్కసారిగా పల్టీకొట్టింది.

కమలం ఛప్పున పైట సవరించుకొని, వొయ్యారం వొలికిస్తూ ఓమూలనిలబడి "వారు లేరు. వారి హెడ్ గుమాస్తాగారిని కలుసుకుందుకని వెళ్లేరు. వారు రాగానే వచ్చేస్తాము" అంది.

కృష్ణమూర్తి నవ్వుతూ దర్జాగా గదిలోకి వెళ్లి ఒక కుర్చీలో కూర్చొంటూ "మీకు మాయింటితోవ తెలియదేమోనని నన్ను పంపించింది—ఆఁ—మీరు కాఫీ పుచ్చుకున్నారా?—కాఫీకికూడా అక్కడికే వచ్చేసుంటే బాగుండును" అన్నాడు.

"కాఫీ తాగే వెళ్లేరులెండి...మానుంచి మీ కనవసరశ్రమ అవుతుందేమోనని భయపడుతున్నాము." అంది కమలం చిరునవ్వుతో.

"అబ్బే! మన మేమి కొత్తవాళ్లమా! పరిచయం అంటే ఇదివరకు లేదుకాని మాఅత్తవారింటికి వచ్చినప్పుడల్లా మిమ్మల్ని చూస్తూనేవుంటాను" అన్నాడు నవ్వుతూ కృష్ణమూర్తి.

కమలం అతనిమీద ఓచిరునవ్వు పారేసి ఊరుకుంది.

"మీరు నిలబడిపోయారు"

"ఫరవాలేదు" అని కమలం కిటికీ నానుకొని నిలబడింది వీథివైపు అప్పుడప్పుడు చూస్తూ.

ఎన్నోసార్లు తా నిదివరకు ఈకృష్ణమూర్తిని చూసే అతని క్రాపింగులాంటి క్రాపింగు పెట్టుకోమని తన మొగుణ్ని బలవంతంచేసిందికాని రామారావు క్లోజుక్రాపులోని సొగసు మరోక్రాపులో లేదని ఆమెమాట పెడచెవిని పెట్టేడు. కృష్ణమూర్తి ఒడ్డూ పొడుగూవిగ్రహాన్నీ, అతని పచ్చని శరీరచ్ఛాయనీ, అతని రిస్టువాచీ, బంగారుసులోచనాలనీ చూసినప్పుడల్లా సుశీల ఎంత అదృష్టవంతురాలో అనుకుంటూం డేది కమలం.

"ఎలా గుంది సినీమా"అని ప్రశ్నించాడు కృష్ణమూర్తి, ఆమెకంఠమాధుర్యాన్నింకా చవిచూద్దామని.

"బాగానే వుంది."

"ఇవ్వాళ కాపిటల్‌లో 'నయాసంసార్' అవుతోంది. అంతా కలిసి మేటినీషోకి వెళ్దామని చూస్తున్నాను"

కమలం కొంచెం నవ్వి "హిందీసినీమాలకి మావారు సాధారణంగా వెళ్లరు" అంది.

"ఆఁ. నే నొప్పిస్తానుగా. అంతా సరదాగా కలిసి వెళ్దామంటే వద్దంటారా ఏమిటి!"

ఇంతలో కమలం కిటికీలోంచి చూసి "అదిగో, ఎవ్వరితోనో కలిసివస్తున్నారు." అంది కొంచెం కంగారుతో. కృష్ణమూర్తి వెంటనే లేచి "నే వెళ్తాను. కొంచెం వేగం వచ్చేయండి" అని గది దాటి మెట్లదగ్గరకు నడిచేడు. కమలం అతని వెంటే ద్వారందాకా వచ్చి నిలబడి చూస్తోంది. చింకికోటుతోనూ, మడతలు దిగని పంచతోనూ మెట్లెక్కివస్తున్న రామారావు కనిపించగానే కమలం ఒక్క నిట్టూర్పు విడిచి గిరుక్కున తిరిగి లోనికి వెళ్లిపోయింది.

కృష్ణమూర్తి రామారావు కెదురుగా వెళ్లి "ఇదిగో ! ఇంకా ఇప్పుడే అడుగుతున్నాను. ఆఫీసుకా వెళ్లేరు?" అని పలుకరించేడు.

"ఆఁ. హెడ్డుగుమాస్తా ఉంటాడేమో అని వాడింటికి వెళ్లేనుకాని వాడి దర్శనం కాలేదు"

"మా ఇల్లు మీకు తెలుస్తుందో లేదో అని వచ్చేను..."

"ఇదిగో, ఇంకో అరగంటలో వచ్చేస్తున్నాము. హైస్కూలువద్దకదూ మీ యిల్లు ?"

"ఆఁ. ఆకాంపౌండు, మేడ... నేను వెళ్తాను మరి"

*  *  *

"వస్తున్నారా?" అని సుశీల మగనిని ఎదుర్కొంది.

"లే దింకా. తోవలోనే కనిపించాడు రామారావు. వారి హెడ్‌క్లార్కు దగ్గరకు వెళ్లివస్తున్నాట్ట. అతన్ని హోటలుదాకా ఓసారి దిగబెట్టి, వేగం రమ్మని చెప్పివచ్చేను"

*  *  *

జట్కా వచ్చి యింటిముందు ఆగింది.

సుశీల వీథివంక చూస్తూ "అదిగో—" అంది.

"అందియలా రవళీవా?" అన్నాడు కృష్ణమూర్తి నవ్వుతూ.

సుశీల వీథిద్వారందగ్గరకు వెళ్లింది.

కృష్ణమూర్తి గదిలో కూచొనే కూనిరాగాలు బనాయిస్తూన్నాడు.

ఇంతలో గదంతా సెంటువాసనలను నింపుతూ కమలం ప్రవేశించి ఇతని గదివై పొకసారి చూచి సుశీలతో ఏదోప్రసంగిస్తూ వెనకయింటిలోనికి వెళ్లిపోయింది.

కృష్ణమూర్తిగదిలోంచి గీతాలు వినవస్తున్నాయి.

"జాజీపూదావీచల్లి
పోయే మెరుపల్లే పెరసి"

ఇంతలో రామారావురావడం, ఏవో పలుకరింపులూ, వాటిలో పడ్డా డతను.

కమలం, రామారావులకు మేడమీది గదుల్లో ఒకటి ఏర్పాటయింది.

*  *  *

శని ఆదివారాలలో దిద్దుదామని ఇంటికి తెచ్చిన కాంపోజిషను పుస్తకాలన్నీ అలమారులో అలా పడే వున్నాయి. కృష్ణమూర్తిచూపులు కమలాన్ని వెంటనంటే వుంటున్నాయి. కమలాన్నీ, తన భార్యనూ ఒక్కదగ్గిర చూసినప్పుడల్లా వారిద్దరిలో కనపడుతున్న భేదానికి అతను ఆశ్చర్యపోతూన్నాడు. కమలం ఇంకా లేతవయస్సు (స్వీటు టీన్సు)లో ఉండి నిగ నిగలాడుతోంది. ఆమెమాటలూ, ముత్యాలపల్వరుస కనిపించే ఆ కిలకిలనవ్వులూ ఆయింటినిండా ప్రతిధ్వనిస్తూ అత న్నేదో ప్రపంచములో విహరింపజేస్తున్నాయి. ఆమెచెక్కిళ్లలోని నునుపు సుశీలలో కనిపింపలే దతని కళ్లకి. చంకలో ఓపిల్లడు. రెండోది 'In-press' (కడుపులో). ఇంకెక్కడి నిగారింపనుకున్నాడు. ఎలాగయినా ఆడవాళ్లు పిల్లల్ని కనడం మొదలుపెట్టగానే ఇహ సరి అన్న అభిప్రాయానికి వచ్చేడు కృష్ణమూర్తి. షేస్ పౌడరు, టాయిలెట్టులతో మెరసిపోతుండే కమలాన్ని చూసి, ఇటు బట్టలన్నీ తడిమరక చేసుకొని వంటింట్లోంచి అటూ ఇటూ హడావిడిగా నడుస్తూన్న సుశీలని చూస్తే......!

భోజనాలయ్యాక రామారావు మళ్లీ వాళ్ల హెడ్డుగుమాస్తాదర్శనార్థం బయలుదేరాడు. అతను వెళ్లేక...

"వచ్చీరావడంతోటే ఆఫీసుపనేనా?" అని కొంచెం హేళనగా అంటూ మేడెక్కుతున్నాడు కృష్ణమూర్తి. కింద కమలం సుశీలతో "ఆయనకు ఆఫీసే ఇల్లు" అంది నవ్వుతూ.

మేడెక్కుతూ ఆమాటలు విన్న కృష్ణమూర్తి కొంచెం నవ్వి "అందుకే తాలూకాఆఫీసుగుమాస్తాలను గురించి ఆపత్రికలో అలా రాసేరు." అన్నాడు.

సుశీల ఆమాటలకి నవ్వుకుంటూ కమలంతో కూడ భోజనానికి వెళ్లింది.

ఇరువురూ భోజనానికి కూచున్నారు. సుశీల వుండివుండి కిసుక్కున నవ్వుతుండడము చూచి "ఎందుకంతగా నవ్వుతున్నా"వంది కమలం, తనూ కొంచెం నవ్వుతూ.

ఆమె అలా ప్రశ్నించగానే మరింత నవ్వు వచ్చింది సుశీలకి. ఆమె నవ్వాపుకుంటూ "అబ్బే, ఏమీ లేదు-ఆయనకొంటెతనము గాని..."

"ఫరవాలేదు చెప్పుదూ" కారణం తెలీకపోయినా, సుశీల నవ్వడము చూస్తుంటే కమలానికీ నవ్వు వస్తూంది.

"ఏమీ లేదు. ఓ తాలూకాకచేరీగుమస్తా...నీకెందరు పిల్లలని ఎవరో అడిగితే—"

సుశీలకి నవ్వాగడంలేదు.

"ఆఁ. అడిగితే ?"

"తాలూకాకచేరీలో చేరకముందు..."

నవ్వును ఆపుకోలేకపోతోంది సుశీల.

"చేరకముందు ?"

"తాలూకాకచేరీలో చేరకముందు ఒక్కపిల్లాడని ఆ...తర్వాత..."

"ఆఁ! ఆతర్వాత ?"

విరగబడి నవ్వుతోంది సుశీల.

"ఆతర్వాత...తీ...రి...కే...లే—"

సుశీలనవ్వు చూసి కమలానికీ నవ్వు వచ్చి నవ్వుతోందికాని ఆమెమనస్సులోమాత్రం ఏవో భావాలు లేచి అలజడిచేస్తున్నాయి.

ఇంతలో సుశీలపుట్టింటినుంచి ఉత్తరం వచ్చింది. కృష్ణమూర్తి మేడ దిగి ఆ ఉత్తరాన్నందుకొని నట్టింటి ద్వారంవద్దకు వచ్చేడు.

"మీరహస్యాలకు అంతరాయం కల్పించడము లేదుకదా?"

సుశీల అతని చేతిలోని కార్డు చూసి "మావాళ్ల దగ్గర్నుంచా?" అని ఆత్రుతతో ప్రశ్నించింది.

"కాదు. మావాళ్లదగ్గర్నుంచి" అన్నాడు నవ్వుతూ కృష్ణమూర్తి.

"కాదు. ఆదస్తూరీ మాతమ్ముడిదిలాగే వుంది"

"భోజనము అవనీ, చదువుదువుగాని"

"ఉహుఁ. ఇలా తెండి"

కృష్ణమూర్తీ, కమలం ఆమె ఆత్రుతకు కొంచెం నవ్వేరు.

"పోనీ, ఎప్పుడు వస్తున్నాడో చెప్పండి" అంది సుశీల కొంచెము రక్తిమతో.

శ్రుతి మించిపోతుందన్న భయం వేసి కృష్ణమూర్తి ఆకార్డు ఆమెపైపు విసరి, కమలంవంక ఓసారి చూసి కొంచెం నవ్వి వెళ్లిపోయినాడు.

సుశీల ఆ ఉత్తరం చదువుకొని "రేపు వస్తున్నాడు మాతమ్ముడు" అంది నేటంత మొహంతో.

"నిన్ను తీసుకోవెళ్లడానికా?"

"అవును. ఈదళమి దాటితే వీలులేదుగా"

"ఎన్నో నెల ఇప్పుడు?"

"ఈదళమికి ఆరో నెల వస్తుంది" అంది సుశీల కొంచెం సిగ్గుతో.

"చాలా వేగమే!" అంది కమలం కొంచెం నవ్వుతూ.

"దాని కేమి భాగ్యము"

"మీ ఆయనకు స్కూల్లోనా పని?"

సుశీల "అవును" అని కొంచెము నే పూరకుండి, వెనకటిసంభాషణ జ్ఞాపకానికి వచ్చి "ఏ మలాగ అడిగేవు?" అంది నవ్వుతూ.

"ఏమీ లేదు...జీత మెంత?"

"నూటాఇరవై"

"అదృష్టవంతురాలి వెలాగయినా"

"ఏమిటో ఆ అదృష్టము?"

"అంటే ... అనుకూలదాంపత్యము ... రాకా పోకా...ముద్దూ ముచ్చటా..."

*           *           *

భోజనముపనులు అయ్యాక ఇరువురూ మేడ మీదికి వెళ్లి వారివారి గదుల్లో దుస్తులు మార్చుకుంటున్నారు. న్యూస్ పేపరు చదువుకుంటూన్న కృష్ణమూర్తి వారి రాక చూచి తన గదిలోంచి పైకి వస్తూ "ఇవ్వాళ అంతా కలసి 'నయాసంసార్' మేటినీషోకు వెళ్దాము...ఏం?" అన్నాడు.

"అవును సుశీలా. సరదాగా కలిసి వెళ్దాము" అంది కమలం.

"నయాసంసార్ లేదు గియాసంసార్ లేదు. నే నెక్కడికీ రాలేనుసుమా. చాలామటుకు సర్దుకోవాలి...ఏంపట్టుకో వెళ్లాలో, ఏమి అక్కరలేదో"

"ఎక్కడికి?" కృష్ణమూర్తి ప్రశ్నించేడు.

"మా వాళ్లింటికి."

"ఎవర్నడిగి?"

"సరిపోయింది!"

ఇరువురి సంభాషణకూ నవ్వుతోంది కమలం.

"నాకు ఇక్ స్పెక్షను రోజులు. ఇప్పుడు వెళ్లడానికి కాదుసుమా"

"బాగానే వుంది. ఏడాది కెన్నిసార్లు ఇక్ స్పెక్షను?"

"ఇంకో వారంపదిరోజు లయ్యాక వెళ్దువుగాని"

"అంటే ఏడవనెలదాకా వీలుండదుకదా అనా?"

"ఆ సంగతి తర్వాత చూసుకోవచ్చునుగాని ముందు సినీమాసంగతి చూడు. నలుగురం కుర్చీల్లో కూచుందాము. ఏం?"

"నే నా మొగవాళ్ల మధ్య కూర్చోలేనుసుమండీ."

"ఏడిసినట్టే వుంది. నాపక్కనేగా కూచునేది?" కమలం పకాలున నవ్వింది.

"అసలు ఆయన వప్పుకుంటారో లేదో అడిగేరా?" అంది సుశీల.

"ఆయన అభ్యంతరం చెప్ప రనుకుంటాను." అని కృష్ణమూర్తి కమలంవంక చూసేడు.

కమలం కొంచెం సిగ్గభినయిస్తూ అతనిపైపు చూసినట్టూ కాక చూడనట్టూ కాక "ఏమో. మీరు చెప్పితే వప్పుకుంటారేమోకాని నే చెపుతే మాత్రం లాభంలేదు ... నిన్న ఆ సినీమాకి వెళ్లినందుకే చికాకు పడ్డారు" అంది.

*           *           *

సుశీల తన బట్టలు సర్దుకుంటూంది.

"ఆ బనారసుచీర పట్టుకోవెళ్తాను. బీరువా

తాళా లివ్వండి" అనీ... "నాపరుపు చిరిగిపోయింది, ఇక్కడుంచేస్తాను, దూది ఏకించి కుట్టించండి. అందాకా మీ పెద్దపరుపు తీసుకో వెళ్తాను" అనీ సుశీల చేస్తున్న హడావిడి చూస్తూ నిలబడ్డది కమలం.

ఇంతలో రాజు కమలంగదిలోంచి టాల్కుం డబ్బీ తీసుకోవచ్చి మూతతీసి వంపుతూండడం చూసింది సుశీల.

"అరెరె! అది తీసే వేమిట్రా... ఉంచీయమ్మా వుంచీ...ఎంత ఖరీ దయిందో ఏమిటో" అని పిల్లడి చేతిలోంచి అది తీయగానే అతను రాగాలాపన మొదలుపెట్టేడు.

"పిల్లాడి కేమి తెలుస్తుంది పోనిద్దూ"అని కమలం వెళ్లి రాజు నెత్తుకొని తన గదిలోనికి తీసుకో పోయి బుజ్జగించి ఊరుకో పెట్టింది.

కృష్ణమూర్తి పిల్లడిని ఏడిపించినందుకు భార్యనొకసారి కోపపడి "ఇలా దా అమ్మా దా" అని కమలం చంకలో నున్న రాజును పిలిచేడు. కమలం ఆ పిల్లాణ్ణి ఒకసారి బుగ్గలు ముద్దులాడి కృష్ణమూర్తివంక చూసి "రాడు" అని నవ్వుతూ నిలబడింది.

*   *   *

"రాత్రి సర్దుకుందువు గాని. మేటినీ షోకి వేళయింది. వేగము కాఫీకి నీళ్లు పెట్టు" అన్నాడు కృష్ణమూర్తి సుశీలా, కమలము లున్న గదిలోకి వస్తూ.

"నాకు ఆ హిందీగోల ఏమీ అర్థం కాదు. నేను రానుసుమండీ"

గదిలో గోడకున్న ఫోటోలు చూస్తూ నిలబడింది కమలం.

"చాలా బాగుంటుందికదూ. అశోక్‌కుమార్ వాళ్లు ఆక్టు చేస్తున్నారు" అన్నాడు కృష్ణమూర్తి.

"ఎవర్తె ఆ అశోకకుమారి?"

కృష్ణమూర్తీ, కమలం ఫకాలున నవ్వేరు. సుశీల అర్థంకాక ఇద్దరివైపూ చూసింది. ఆమె అలా చూస్తున్నకొద్దీ వారికి నవ్వు హెచ్చవుతోంది. సుశీల పెట్టె తలుపు ధడాలున మూసి చివాలున లేచి "ఆకాఫీనీళ్లు ఏవో చేసియిచ్చేస్తాను. తాగి మీరంతా వెళ్లండి"అని గబగబ మేడ దిగి వెళ్లిపోయింది.

కృష్ణమూర్తి నవ్వుతూ కమలంవంక చూసి "మీ ఆయనసంగ తేమిటి? సాయంత్రానికిగాని రానట్టుందే!" అన్నాడు.

"ఏమో, ఎప్పుడు వస్తారో. ఇంతకూ సినీమాకి వెళ్లడానికి యిష్టపడతారో లేదో."

కృష్ణమూర్తికి ఆమెజవాబు చెవుల కెక్కనే లేదు. ద్వారాని కడ్డంగా నిలబడి ఆమెసౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నాడు. కమలం గదిలో గోడకున్న ఫోటోలను వరుసగా చూస్తూ ఓఫోటోదగ్గర ఆగిపోయి "పెళ్లిఫోటో కాబోలు" అని ఇతనివై పొకసారి చూసి నవ్వింది.

కృష్ణమూర్తి లోన ప్రవేశిస్తూ "అవును. అర్థాన్నంగా తగలడ్డది. కుర్చీమీద కూచోమంటే వప్పుకుంటేనా?"అని ఆఫోటోని గోడమీంచి తీసి కమలానికందిచ్చేడు. కమలం అతనివంక ఓసారి చూసి ఆఫోటో నందుకొని "అవును, అంత ఎడంగా నిలబడిపోయిందేమిటి?" అంది.

"దానిపేరు సిగ్గు" అని నవ్వేడు కృష్ణమూర్తి, ఫోటోను చూస్తున్నట్టు ఆమెకు సమీపంగా వచ్చి.

ఒక్క నిమిషము నిశ్శబ్దము.

కృష్ణమూర్తి ఆమెఅరచేతివంక చూస్తూ "చేతిలో మంచి అదృష్టరేఖ వుందే!" అన్నాడు.

కమలం ఫోటోని టేబిల్ మీద పెడుతూ "మీకు చెయ్యి చూడ్డం వచ్చునేమిటి?" అంది చిరునవ్వుతో.

"ఏదో కొద్దిగా...ఏదీ...ఆయుష్యరేఖ (Life Line) కూడా..."

కమలం తన అరచేతిని విప్పిచూపిస్తూ పైటంతా ముడుచుకుని ఎడంగా నిలబడింది.

కృష్ణమూర్తి ఆమెఅరచేతిని చూస్తూచూస్తూ ఆమెబొటనవేలి కింది భాగాన్ని కొంచెం తాకి "Mount of Venus Prominent గా వుందన్నమాట!" అన్నాడు ఒక్కసారి ఆమెకళ్లల్లోకి చూసి.

కమలంవళ్లు కొంచెం జలదరించింది. అప్రయత్నంగా ఒక్క అడుగు వెనక్కి వేసింది ద్వారంవంక చూస్తూ.

కిందినుంచి సుశీలగొంతుక వినిపించింది :

"అప్పీ ! కాఫీగుడ్డ ఎక్కడ పెట్టేవు?"

కృష్ణమూర్తి ఆమెఅరచేతిని పరీక్షిస్తూ పరీక్షిస్తూ "ఏదీ, మత్స్యరేఖకూడా వుందీ!" అంటూ తటాలున ఆమెమణికట్టును పట్టుకున్నాడు.

కమలంశరీరం కంపిస్తోంది. కృష్ణమూర్తి ఆమె కళ్లల్లోకి చూసేడు. "భయపడుతున్నట్టుంది" అన్నాడు మెల్లిగా.

కృష్ణమూర్తిచేతిలో ఆమెచేయి నలిగిపోతోంది. ఆమెజడలోని సువాసనలతో అతనిలోని పశుత్వము రేకెత్తింది...'అబ్బ'......

ఇంతలో కాఫీకప్పుతో ద్వారందగ్గర సుశీల ప్రత్యక్షం! లోన కనిపించిన ఆ దృశ్యంతో ఆమెకళ్లు చెవరిపోయాయి.

ద్వారమువద్ద ఛాయని చూసి లోనివా రిద్దరూ కంగారుపడ్డారు.

"అ...అదృష్టరేఖ...బాగానేవుంది" అని తడబడుతూ కమలంచెయ్యి వదిలేశాడు కృష్ణమూర్తి. కమలం దూరంగా వెళ్లిపోయింది.

సుశీల గది ప్రవేశిస్తూ "చెయ్యి చూస్తూన్నారా ఏమిటి ? ఫీజు సెటిల్ చేసుకున్నారా?" అంది లేని నవ్వు తెచ్చుకొని.

సుశీల అందిచ్చిన కాఫీకప్పు ఎలాగో చేతిలోంచి జారి కింద పడకుండా తాగేసి కప్పు బల్లమీద పెట్టేసి వెళ్లిపోయాడు కృష్ణమూర్తి.

సుశీలపెదవులపై నవ్వు చూసి కమలం కొంత ఊరటపడింది. టేబిల్ మీదనున్న కాఫీకప్పు అందుకుంటూ అక్కడ పడియున్న ఫోటోని చూసి "పెళ్లినాటిది కిందపడేశారూ?" అంది.

* * * *

సుశీల అటు కృష్ణమూర్తికిగాని, ఇటు కమలానికిగాని ఏమీ అనుమానం కలక్కుండా మామూలుగా నవ్వుతూ తిరుగుతోంది. బుర్రలో మాత్రం అనేకఆలోచనలు పరుగెత్తుతున్నాయి.

సాయంత్రం. మొహం కడుక్కొందికి కమలం, సుశీలా పెరట్లోకి వెళ్లేరు. కృష్ణమూర్తికూడ ఏదో పనిమీద పెరట్లోకి వచ్చేడు. సుశీల ఎత్తుకుంది సన్నని గొంతుకతో.

"నిజమో కాదో
యమునాతటిలో
రాధామాధవలీల"

"నీ కీపాట వచ్చునుకదూ కమలం?"

"అబ్బే—రాదు"

"బాగుంటుందిసుమా" అని మెల్లిగా పాడడం మొదలుపెట్టింది, అటు కృష్ణమూర్తివంకా, ఇటు కమలంవంకా చూస్తూ.

"చంద్రిక నీవు
చందురు డతడు
మధురమధువు నీవు"

కృష్ణమూర్తికి భార్యకళ్లల్లో ఓమాదిరి ప్రతీకారం కనిపించింది.

* * *

రామారావు కొన్ని ఫైల్లు పట్టుకొని ఏఁలయిదున్నరకో వచ్చేడు. మేటినీషోటైము మించిపోవడంచేత ఆరుగంటల ఆటకి వెళ్లడానికి నిశ్చయమైంది. టిక్కెట్లఖర్చు కృష్ణమూర్తి పెడతాడని తెలిసిన తర్వాత రామారావు ఏమీ అభ్యంతర పెట్టలేదు. సుశీలమాత్రం తనకు తలనొప్పిగా వుందనీ, పైగా ఆ హిందీ తనకు బోధపడదనీ సాకు చెప్పి, ఎవ రెంత బలవంతం చేసినా వెళ్లలేదు.

ఫలహారములు చేసి మిగతా ముగ్గురూ వెళ్లిపోగానే సుశీల తొందరతొందరగా పెట్టె తీసి పండ్రెండురూపాయలు పట్టుకొని పెరటిగోడదగ్గిరకు వెళ్లి పొరుగుసుబ్బమ్మగారిని పిలిచింది.

"సుబ్బమ్మ దొడ్డమ్మగారూ, మీ రొక సహాయం చేసిపెట్టాలి. ఆ ఎదురుగా రమణమ్మగారిల్లు ఖాళీగా వుంది. ఈ రూపాయలు ఒకనెల అద్దె అని

వారి కిచ్చి, ఆ యిల్లు మీ పేరుతోనే తాళంవేయించుకోరావాలి. కారణం తరువాత చెబుతాను. ఈ రాత్రే ఆ యింటికి తాళంపడిపోవాలి. నేనిలా చెప్పిన విషయం మూడోకంటివాడికి తెలీకూడదు! ఈవీధి చివరనే కాబోలున్నారు రమణమ్మగారు."

"అయితే,మీ యింటికి ఎవరండీ ఆ అమ్మాయి-"

"అదిగో అదే నే చేసిన పొరబాటు. తెలిసి తెలిసి కొరివితో తల గోక్కున్నట్టయింది. వాళ్లు ఆ ఎదురుగుండా యింట్లో దిగకుండానే ఈ ప్రయత్నం."

"అలాగా? తెలిసిందిలే అమ్మా. చూస్తుండగా నీ గూట్లో మన్నుపడనిస్తానటమ్మా... తే ఆ రూపాయలు. ఇప్పుడే వెళ్లి ఆ యింటికి తాళం వేయించుకొ చక్కావస్తాను. రమణమ్మ నే నెంత చెపితే అంత."

*　　*　　*　　*

సినీమా చూచి వచ్చింతర్వాత అట్టే ప్రసంగములు ఏవీ పడలేదు. రాత్రి భోజనా లయేక ఎవరిగూళ్లల్లోకి వారు చేరుకుంటున్నారు.

సుశీల మేడమీద వారిగదిలోకి వచ్చి మంచినీళ్ల చెంబు మేజామీద పెడుతూ "ఈవేళ మీ మేటినీషో నానుంచి పాపం భగ్నమయింది" అంది నర్మగర్భంగా.

మంచముమీద అటూ ఇటూ దొర్లుతున్న కృష్ణమూర్తి ఈమెవంక చూచి "అయితే నేమి, ఆరుగంటల ఆటకి వెళ్లాముగా ... నువ్వు రానంత మాత్రాన —" అన్నాడు.

"నయాసంసార్ సంగతి కాదు ... ఇక్కడ మీ మేటినీషోసంగతి చెపుతున్నాను."

కొంచెం గతుక్కుమన్నాడు కృష్ణమూర్తి. ఆమెవంక చూసేడు. ఆమెచూపులకి ఆగలేకుండా వున్నాడు. కొంతసేపుండి ప్రసంగం మార్చాలని "మీ తమ్ముడు వచ్చింతర్వాత రెండురోజులయినా వుంటాడా?" అని ప్రశ్నించాడు.

"ఎందుకూ! నేను మరి వెళ్లదలచుకోలేదు."

ఆశ్చర్యపోయాడు కృష్ణమూర్తి. "అంత ఉబలాటపడ్డావు! ఏ మొచ్చిం దిప్పుడు?"

"వీరికి యిల్లు ఏదీ కుదర్చకుండా ఎలాగు వెళ్లేది?"

"దాని కేముంది? రేపే రమణమ్మగారితో మాట్లాడి నిశ్చయంచేస్తాను ఆ ఎదురుగుండా యిల్లు"

కృష్ణమూర్తి గోడవంక తిరిగి కూనిరాగాలు తీస్తూ "అందాలదీవి యీమె" అని ఎత్తుకోగానే అర్థోక్తిలోనే "అవునేమో దేవకాంత!" అని అందుకుంది సుశీల. కృష్ణమూర్తి ఈ వైపు తిరిగి భార్యవంక చూసేడు. ఆడు పులే!

"ఏదీ, ఎన్నాళ్లయింది, ఒకపాట పాడు"

"నాకు రావు"

ఆమెస్వరానికి భయపడి ఇప్పు డేమన్నా ప్రమాదమేనని గుప్‌చుప్‌గా కళ్లుమూసుకొని పడుకున్నాడు కృష్ణమూర్తి.

పక్కగదిలో. కమలం మంచంమీద కూర్చొని ఆవలిస్తోంది. అప్పుడప్పుడు ఈగదిలోని అలుకుడు వినవస్తోంది. అటు మగనివంక చూస్తే ఫైళ్లలో మునిగి వున్నాడు!

"ఇంకా ఎంతవరకూ రాసుకుంటారు?"

"ఇంకోగంట"

తల యెత్తకుండానే జబాబుచెప్పి అతడు ఏదో కాగితముమీద కలం పట్టుకొని తెగబరుకుతున్నాడు!

మూతీ ముక్కూ విరిచి ముసుగుతన్ని పడుకుందామె.

*　　*　　*

మర్నాడు తెల్లవారకట్ల పేసింజరులో సుశీల తమ్ముడు సుబ్బారావు వచ్చేడు. వీరింట్లో కమలాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

"అరె! ఇది ఇక్కడుం దేమిటి?"

"మేటినీ షోపరిచయం" అంది సుశీల కృష్ణమూర్తి వింటూండగానే.

కృష్ణమూర్తి మారుమాట్లాడకుండా పైమీద తోణీ వేసుకొని రమణమ్మగారింటికని బయలు దేరేడు. అసలే చికాకుగా వున్నాడు. అక్కడా గ్రేడ్ తిన

గానే అతని చికాకంతా సుబ్బమ్మగారిమీద తిట్లగా బయటికివచ్చింది.

ఇంటికి రాగానే భార్య కట్టిన సామానులన్నీ విప్పుతోంది. "ఏమిటయిం"దని అడిగింది ఇతన్ని చూసి.

"తప్పిపోయింది. నిన్ననే ఈ పొరుగు బోడి అప్పుడే మాట్లాడడమేకాకుండా ఓనెలఅద్దెకూడా అడ్వాన్సు ఇచ్చి అఘోరించిందట. ఈబోడిదానికి అర్జెంటుగా ఇప్పుడు యిల్లెందుకు కావలసివచ్చిందో?"

"పాపం! మీ అదృష్టరేఖ అనుకున్నంతబాగా వున్నట్టు లేదు" అంటూ సుశీల వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఇటు కృష్ణమూర్తికీ, అటు కమలానికీ చురుక్కుమంది. ఒకరి నొకరు ఒకక్షణం చూసుకొని తలలు వాల్చుకున్నారు.

భోజనాలవద్ద సుశీల తమ్మునితో కారణాంతరాలవల్ల తా నిప్పట్లో రాలేనని చెప్పేసింది. అతగాడు ఎందుకు, ఏమిటి అని ఏమీ ప్రశ్నింపకపోవడము చూసి, తమ్మునితో రహస్యంగా ఏదో చెప్పేవుంటుం దని భావించుకున్నాడు కృష్ణమూర్తి. అంతా కృష్ణమూర్తిసముఖానే జరిగిందికాని అతన్ని ఏప్రసక్తీ ఎవ్వరూ అడుగలేదు.

సుబ్బారావు తనకు సెలవులు దండు గెండుకని సాయంత్రం అయిదుగంటల పేసింజరులోనే తిరిగి వెళ్లిపోయినాడు.

సాయంత్రము స్కూలునుంచి వస్తూ కృష్ణమూర్తి చేతిలోని నాలుగు మల్లిపూలదండలనీ భార్యవైపు విసరేడు. సుశీల ఆశ్చర్యపడి "ఎప్పుడూ లేదు. ఇదేమి టిలాగ"అంది.

కృష్ణమూర్తి దుస్తులు విప్పుకుంటూ "మేష్టర్లంతా కలిసి కొన్నారు. నావంతు నాలుగుదండలూ నే తెచ్చేశాను"అన్నాడు చాలా వికటంగా.

"మేష్టర్లందరికీ ఈవేళ మల్లిపువ్వులమీదకు మనసు వెళ్లడం ఆశ్చర్యంగానే వుంది. అయినా స్కూలుకి మల్లిపువ్వు లెవరు అమ్మతెచ్చేరుచెప్మా!"

సుశీలమాటలకు నవ్వువచ్చిందో, లేక తనవంక చూస్తున్నది కనుక నవ్వా లనుకుందోగాని కమలం కొంచెం నవ్వింది. సుశీలా నవ్వింది. కాని ఆనవ్వులో జీవముమాత్రము లేదు.

"స్కూలుకి అమ్మతెచ్చేయని ఎవరు చెప్పారూ? తోవలో కన్పించేయి, కొన్నాము."

"అయితే, ఇటు మార్కెటువైపునుంచి మీరు వస్తున్నారేలా?"

ఇంత క్రాసుపరీక్ష వుంటుందని అతను, పాపం, అనుకోలేదు. తనకి అబద్ధము ఆడడం అంతగా చేతగాదని కృష్ణమూర్తికి ఆనాడు తెలిసింది.

కమలాన్ని జడవేస్తాను రమ్మని బలవంతపెట్టింది సుశీల. విధిలేక వప్పుకుంది కమలం.

కమలంవాసననూనె, పన్ని తెచ్చి దువ్వడం ఆరంభించింది సుశీల. దువ్వుతూ దువ్వుతూ సన్నని గొంతుకలో "వాడే చెలీ... అపవాదే చెలీ" అని ఎత్తుకుంది. కాఫీతాగుతూన్న కృష్ణమూర్తికి ఆనాడు భార్యప్రవర్తన చాలా వింతగా కనిపించింది.

"ఆఁ. గట్టిగా బిగించకు"

"లేదమ్మా, వదులుగానే వేస్తున్నాను."

...............

"మోసకారి కాముదాసుల
మాటలు నీటిమూటే చెలీ" అంటూ సుశీల నాలుగు దండలూ కమలంజడలోనే పెట్టేసింది.

"అరె! పువ్వు లన్నీ నాకే పెట్టేశా వేమిటి?"

"ఉండనీ. నా కెందుకు, ముసలిదాన్ని"

వెనక్కి తిరిగిచూచింది కమలం.

"పాతికేళ్లు నిండా లేవు. ముసలిదాని వయ్యావప్పుడే!"

"పిల్లలు పుట్టుకొచ్చింతర్వాత మరేమిటి చెప్పూ!"

కృష్ణమూర్తి చకితు డయ్యాడు.

కమలం, సుశీలా సబ్బుబిళ్ల పట్టుకొని పెరట్లోకి వెళ్లేరు. నూతిదగ్గర కమలం సుశీలచెయ్యి పట్టుకొని

"సుశీలా, నీ మాటలు అదోమాదిరిగా ఉంటున్నాయి. ఏమిటి కారణం?" అంది.

సుశీల కమలాన్ని నిదానించి చూసి అంది: "అయితే, అడుగుతున్నాను నిజం చెప్పు...తప్పెవరిది? నీదా, ఆయనదా?"

కమలం దిగాలుపడిపోయింది.

అప్పుడే ఆఫీసునుంచి వచ్చిన రామారావు కాళ్లు కడుక్కుందుకని పెరట్లోకి వస్తూ నూతిదగ్గర ఆడువారి అలుకుడు విని తిరిగిపోబోతూ విన్నాడా మాటలు.

సుశీల అంటోంది: "పెద్దదాన్ని చిన్నదాన్ని- చెబుతున్నాను. నువ్వు ఆయనకు కొంచెం దూరంగా ఉండడము మంచిది కమలం."

స్తబ్ధుడై నిలబడిపోయాడు రామారావు. బుఱ్ఱలో ఏవో రైళ్లు పరుగెడుతున్నట్టవుతోంది.

*   *   *

రాత్రి ఏప్రసంగమూ అడుగలేదు రామారావు. మర్నాడు. వేగం లేచి ఇళ్లకోసం ఊరంతా గాలించేడు కాని ఎక్కడా దొరకలేదు. మరి గత్యంతరం లేక నేషనల్ హోటలుకే వెళ్లి తాము మళ్లా అక్కడికే వస్తున్నామని చెప్పి పదిగంటలకు ఇంటికి చేరుకున్నాడు. అప్పటి కప్పుడే కృష్ణమూర్తి భోంచేసి స్కూలుకు వెళ్లిపోయాడు.

రామారావు భార్యను పిలిచి "ఇగో, మంచియిల్లొకటి కుదుర్చుకొవచ్చేను. వేగం సామాన్లు కట్టు" అన్నాడు.

సుశీల అతనిమాటలు విని "ఇప్పటికిప్పు డేమి తొందర? వారు రానీ...సాయింత్రము వారు వస్తే వెళ్లిపోదురుగాని." అంది.

"ఆలస్యము చేస్తే ఈ ఇల్లుకూడా తప్పిపోగలదు" అంటూ రామారావు స్నానానికి వెళ్లిపోయాడు. అతని కళ్లల్లోని తీవ్రతకి ఇరువురుస్త్రీలూ వింతపడ్డారు.

సుశీలబలవంతంమీద ఇరువురూ భోజనం చేసేరు. రామారావు జట్కాకోసం వెళ్లేడు. కమలం తన టాయిలెట్ బాక్సు పెట్టెలో పెడుతోంది.

"ఈ ఎదురుగుండా ఇల్లు దొరికివుంటే చక్కా ఇద్దరికీ వుండుపోనా, అది చేయిజారిపోయినదాకా వూరుకున్నారు మావారు...ఎక్కడయితేనేమి, ఇల్లు దొరికిందికదా...మళ్లా నేను మావూరునించి వచ్చిన తర్వాత వచ్చి మీ యిల్లు చూస్తానులే" అంది సుశీల.

"ఎప్పుడు వెళ్తున్నావు?"

"ఈ రాత్రి"

"ఈ రాత్రే!"

"ఆఁ. మావారితో కలిసి"

*   *   *   *

హోటలు చేరిందాకా రామారావు ఏమీ అనలేదు. జట్కావాడికి డబ్బిచ్చి పంపించి మేడ మీదికి వచ్చి భార్యవంక ఉగ్రుడై చూచి "ఏమిటి చేశావానెఘన?" అని ఉరిమేడు.

అతని స్వరూపం చూసి భీతితో వణుకుతూ ఓమూల నిలబడింది కమలం.

..................

వచ్చీరావడముతోనే భార్యాభర్తల కెందుకు కలహం వచ్చిందా అని ఆహోటలువాళ్లంతా ఆశ్చర్యపోయారు. ఆనాటకం చూసినవాళ్లంతా 'ఎంత నిర్దయుడు' అనీ, "పాపం కాకిముక్కుకి దొండపండు" అనీ తలోరీతి అనుకున్నారు.

*   *   *

పండ్రెండున్నరకు కృష్ణమూర్తి యింటికి వచ్చేటప్పటికి సుశీల పేరంటానికి బయలుదేరుతున్నట్టు ముస్తాబైవుంది. నీలిచీరా, సిల్కుజాకెట్టూ, వాలుజడా— చాలానాళ్లయిం దామెను ఆ ముస్తాబుతో చూడ్డం అతను. గదిలో ప్రయాణానికి సిద్ధంగా సామాను లన్నీ సర్దివున్నాయి.

"ఏమి టిదంతా? వా రేరీ?"

"వెళ్లిపోయారు. వారి కేదో ఇల్లు దొరికిందిట"

"అంత హఠాత్తుగా వెళ్లిపోయా రేమిటి?"

"అవును మరి. ఆ బ్రాహ్మడు మిమ్మల్ని నమ్ముకొని ఇక్కడకు వచ్చినందుకు బాగానే చేసేరు"

"ఏమిటి చేశానంటావు?"

"మేటినీషో గోలలో వుండిపోయి —"

దుస్తులు విప్పుకుంటూ సుశీలవంక తిరిగి చూసేడు కృష్ణమూర్తి.

"మేటినీ షోగోలలో వుండిపోయి ఎదురుగుండా రమణమ్మగారిల్లు చేయిజారిందాకా వూరుకున్నారా మరి"

కాఫీ తేవడానికి వెళ్లింది సుశీల.

కాఫీ పట్టుకొస్తున్న ఆమెను చూచి కృష్ణమూర్తి వాలుకుర్చీలో కూర్చొంటూ "మట్టమధ్యాహ్నం ఆ ముస్తాబేమిటి, ఈ సామాన్లన్నీ ఇలా సర్దివున్నాయేమిటి?" అన్నాడు.

"మా వాళ్లింటికి ప్రయాణం. వీలుగా వుంటే సాయంత్రం పేసింజరులో, లేకపోతే రాత్రి మెయిలులో"

"ఎవరివెంట?"

"మీ వెంటేను — మీ బట్టలన్నీ కూడా సర్దేశాను — మీరు ఏమూడురోజులయినా సెలవు పెట్టాలి"

కృష్ణమూర్తి కాఫీతాగుతూ "వచ్చిన తమ్ముణ్ణి పంపేయడమేమిటి ... నావెంట ఇప్పుడు ప్రయాణమేమిటి — నాకేమీ అర్థం ..."

"అంతా మీ మేటినీషో చేసింది"

"ఏమిటి, మేటినీషో, మేటినీషో అని చంపేస్తున్నావు!"

తమలపాకులు చీరుతూ అంది సుశీల: "మా వాళ్లింటికి మీరు ఎప్పుడు వచ్చినా ఆ ఎదురుగుండా కిటికీపైపే చూస్తూండేవారని మాచెల్లి చెబితే ఏమిటో అనుకున్నాను ... పాతపరిచయం అన్నమాట!"

"దాని మొహం, నీ మొహమూను!"

సుశీల తలవంచుకునే తమలపాకులు చీరుతోంది. దూరంగా ఆడుకుంటున్న రాజు అలవాటు చొప్పున తల్లిదగ్గరకు వచ్చి "నే నిత్తా" నని చేతులు జాచేడు.

సుశీల తమలపాకులు చిలకలుచుట్టి పిల్లడివేళ్లకి పెడుతోంది. సుశీలవంక చూస్తూ ఆలోచిస్తున్నాడు కృష్ణమూర్తి: ఇంట్లో ఈయుద్ధపరిస్థితులు ఎల్లా చల్లారుతాయా అని.

సుశీల రాజు నెత్తుకొని అతనివ్రేలికున్న తమలపాకుల చుట్టల్ని మగనినోటి కందిచ్చింది. పదివేళ్లలోనివి కృష్ణమూర్తి నోటితో అందుకున్నాడు. వేళ్లకి కితకితలయి రాజు నవ్వుతున్నాడు. సుశీల రాజు నెత్తుకొని చేతుల్లో ఎగరవేస్తూ,

"రివ్వున ఎగిరే బొమ్మలూ—
గిరగిర తిరిగే...పకపకనవ్వే—"

తల్లి చేతుల్లో కిలకిల నవ్వుతున్నాడు రాజు.

భార్యమొహంలో మళ్లీ దరహాస చంద్రికలు పొడగట్టడంతో ప్రాణం లేచివచ్చిన ట్టయింది కృష్ణమూర్తికి.

సుశీల కొడుకును ఆడించి ఆడించి తండ్రివొడిలో కూలవేసింది నవ్వుతూ. ఆ ఊపులో ఆమెజడ అతని చెంపకు తగిలింది.

కృష్ణమూర్తి కొడుకుబుగ్గల్ని ముద్దుపెట్టుకొని, జేబులోని రంగుసుద్ద వొకటి అతని చేతిలో పెట్టి కిందకు దింపేశాడు.

"ఏమిటి, అప్పుడే వేళయిపోయిందీ?"

భార్యవంక భర్తా, భర్తవంక భార్యా కొంతసేపలా చూచుకొన్నారు. ఇద్దరికీ నవ్వు వచ్చింది.

"సుఖసంసారమె పరమానందం" అంటున్నాయామె కళ్లు.

ఉన్నట్టుండి కృష్ణమూర్తి ఆమెచేతిని పట్టుకున్నాడు.

"నా అదృష్టరేఖ అంత బాగుండదేమో!"

"సుశీ...పొరబాటు...కొంచెం కాలు జారిందంతే."

ఆమెకళ్లల్లో క్షమాపణ కనిపించింది... దగ్గరకు లాక్కున్నాడు.

"మేటినీషోవా?" అని సుశీల నవ్వుతూంటే...

కింద సుద్దతో గీతలు గీసుకుంటున్న రాజు సుద్దముక్క జారవిడిచి వింతగా చూస్తున్నాడు వారిద్దరివైపూ.